



కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి లోకేశ్



కళ్యాణదుర్గంలో అభిమానుల కోలాహలం

ప్రజలకు చెప్పండి..!

16 నెలల్లో ఎన్నో మంచి పనులు చేశాం

- వైసీపీ ఫేక్ ప్రచారాలను తిప్పికొట్టండి
- పనిచేసినవారికి నామినేటెడ్ పదవులిచ్చాం
- కూటమి కార్యకర్తలు కలిసికట్టుగా వెళ్లాలి
- ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- కళ్యాణదుర్గంలో కార్యకర్తలతో సమావేశం
- యువనేతకు జనం, శ్రేణుల ఘన స్వాగతం



కళ్యాణదుర్గంలో లోకేశ్‌పై పూల వాన



ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజలకు చెప్పాలని, అదే సమయంలో వైసీపీ ఫేక్ ప్రచారాలను తిప్పికొట్టాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కళ్యాణదుర్గంలో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. 'కార్యకర్తే అధినేత' అని కడపలో నిర్వహించిన మహానాడులో చెప్పిన మాటలను గుర్తు చేశారు. అది ఆచరణలో పెడుతున్నామని, సీఎం చంద్రబాబు, తాను ఎక్కడికి వెళ్లినా ముందు కార్యకర్తల సమస్యలను తెలుసుకుంటున్నామని అన్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం కళ్యాణదుర్గానికి వచ్చిన లోకేశ్‌కు అశేష జనవాహిని నీరాజనం పలికింది. అడుగడుగునా పూలవర్షం కురిపిస్తూ, నారా లోకేశ్ నాయకత్వం వర్ధిల్లాలి అని నినదించింది. మహిళలు వీరతిలకం దిద్దుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. చిన్నారులు సైతం మిద్దెలపై నిలబడి ప్లకార్డులు చేతపట్టి లోకేశ్‌కు జై కొట్టారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ సహకారంతోనే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. నియోజకవర్గ పర్యటనకు మంత్రి నారా లోకేశ్ రెండు రోజులు కేటాయించి, ఇక్కడి ప్రజల సాధకబాధకాలను తెలుసుకోవడం ఎంతో సంతోషించదగ్గ విషయమని అన్నారు.

● నేడు కనకదాస విగ్రహావిష్కరణ

కళ్యాణదుర్గం పట్టణంలో ఏర్పాటు చేసిన భక్త కనకదాస విగ్రహాన్ని మంత్రి నారా లోకేశ్ శనివారం ఆవిష్కరించనున్నారు. పట్టణంలోని కంబదూరు రోడ్డులో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా కనకదాస జయంతిని నిర్వహించనున్న నేపథ్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని లోకేశ్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేస్తున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు.



సమావేశంలో కార్యకర్తలు నాయకులు



ఉత్సాహం



సంబరం

వివరాలు 6



ఉసిరి కాయల అలంకరణలో స్వామివారు

బుగ్గ రామలింగేశ్వరుడికి ఉసిరి అలంకరణ

తాడిపత్రి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రసిద్ధ బుగ్గ రామలింగేశ్వర స్వామికి కార్తీక శుక్రవారాన్ని పురస్కరించుకుని ఉసిరి కాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామికి అభిషేకాలు చేశారు. అనంతరం ఉసిరి కాయలతో అలంకరించారు. స్వామి దర్శనానికి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు.

మైనింగ్ ప్రాంతంలో రాడార్ సర్వే

మీరు వెళ్లడానికి వీల్లేదు..!

● పుట్టపర్తిలో ప్రొటోకాల్ గొడవ

రద్దీకి తగ్గట్టుగా బస్సులు

● ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు

7

విత్తుకున్నాక విత్తనాలా..!

- పప్పుశనగ విత్తన పంపిణీలో తీవ్ర జాప్యం
- పంట సాగైన తర్వాత పంపిణీ మొదలు
- ఎండు తెగులు సోకిన పొలాల్లో... తిరిగి విత్తుకునేందుకే రిజిస్ట్రేషన్
- విస్తుపోతున్న రైతులు



బెళుగుప్పలో సాగు చేసిన పప్పుశనగ పంట

అనంతపురం అర్బన్/బెళుగుప్ప, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈసారి రబీ సీజన్‌లో పప్పుశనగ సాగు పూర్తయ్యాక సబ్సిడీ విత్తనాలు పంపిణీ మొదలు పెట్టడం ఏమిటో...? అంటూ నల్లరేగడి రైతులు నిట్టూరుస్తున్నారు. రబీ సీజన్ ప్రారంభమైన నెల రోజుల తర్వాత పప్పుశనగ పంపిణీకి శ్రీకారం చుట్టడం విమర్శలకు తావిస్తోంది. ఈసారి ముందస్తుగా పదును వర్షాలు పడటంతో సీజన్ ప్రారంభంలోనే పప్పుశనగ విత్తనం వేశారు. బెళుగుప్ప మండలంలో అక్టోబరు మొదటి వారంలోనే విత్తనం మొదలెట్టారు. ఆ తర్వాత ఉరవకొండ, విడపనకల్లు, తాడిపత్రి, యల్లనూరు, యాడికి మండలాల్లో విత్తు జోరందుకుంది. జిల్లాలో పప్పుశనగ పంట సాగు పూర్తయింది. పలు ప్రాంతాల్లో మొదటి రౌండ్ పిచికారీ కూడా మొదలు పెట్టారు. మరో పది రోజుల్లో పూత దశకు చేరుకోనుంది. రబీ సీజన్ ప్రారంభ మాసంలో సబ్సిడీ విత్తనం కోసం ఎదురుచూసినా ప్రయోజనం లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో బయట మార్కెట్‌లో కొనుగోలు చేసి రైతులు విత్తనం వేసుకున్నారు.

నెల రోజులు ఆలస్యంగా..

ఎన్నడూలేని విధంగా ఈసారి సబ్సిడీ పప్పుశనగ విత్తనాల పంపిణీపై తీవ్ర నిర్లక్ష్యం వహించారు. అక్టోబరు 1వ తేదీన రబీ సీజన్ ప్రారంభమైంది. ఈ ఏడాది పప్పుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 65వేల హెక్టార్లుగా నిర్ణయించారు. ఇప్పటికే సాధారణ సాగు విస్తీర్ణంలో పప్పుశనగ పంట సాగైనట్లు సమాచారం. వ్యవసాయ శాఖ అధికారిక వర్గాల సమాచారం మేరకు 25వేల హెక్టార్లలో పప్పుశనగ సాగైనట్లు చూపుతున్నారు. ఖరీఫ్ ఈ పంట నమోదు నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఇంకా పంట సాగు వివరాలు సరిగా సేకరించకపోవడంతోనే ఈ వ్యత్యాసం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది సెప్టెంబరు 29వతేదీన ప్రభుత్వం సబ్సిడీ ధరలు ఖరారు చేసింది. పప్పుశనగ జేజీ-11 రకం క్వింటా పూర్తి ధర రూ.7,800గా నిర్ణయించారు. ఇందులో 25 శాతం సబ్సిడీపోను రైతు వాటా కింద క్వింటాకి రూ.5850 చెల్లించాలని నిర్ణయించారు. ఈసారి కేవలం 14వేల క్వింటాళ్లు కేటాయించారు. గతేడాది అక్టోబరు 1వతేదీనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు పెట్టారు. అక్టోబరు రెండోవారం నుంచి విత్తన పంపిణీ ప్రారంభించారు. ఈసారి రబీ సీజన్ ప్రారంభమైన నెల రోజుల తర్వాత నుంచి రిజిస్ట్రేషన్‌తోపాటు పంపిణీ మొదలు పెట్టడం గమనార్హం. విత్తన సరఫరాదారులకు బకాయిలు చెల్లించకపోవడం... వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల నిర్వాకంతో ఈసారి సబ్సిడీ పప్పుశనగకు రైతులు దూరమయ్యారు.

మళ్లీ విత్తేందుకే..

తుఫాన్ ప్రభావంతో వరుసగా కురిసిన వర్షాలకు తేమ శాతం ఎక్కువ కావడంతో పలు ప్రాంతాల్లో పప్పుశనగ పంటకు ఎండుతెగులు సోకింది. దీంతో పంట నిట్టనిలువునా ఎండిపోయింది. ఆ పంటను తొలగించి, తిరిగి విత్తేందుకు కొందరు అన్నదాతలు సబ్సిడీ పప్పుశనగ కోసం రైతు సేవాకేంద్రాల్లో పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు సమాచారం. ఇందులో కొందరు సబ్సిడీ విత్తనాలు కొనుగోలు చేయగా.. మరికొందరు తమ ప్రాంతానికి ఇంకా సరఫరా కాకపోవడంతో బయట మార్కెట్‌లోనే కొనుగోలు చేసి, తొలగించిన పంట స్థానంలో తిరిగి విత్తనం వేసుకున్నారు. మరోవైపు యల్లనూరు, పుట్లూరు మండలాల్లో ఇటీవల వరుస వర్షాలు పడటంతో కొంత విస్తీర్ణంలో విత్తనం వేయలేకపోయారు. ఆయా రైతులు కూడా సబ్సిడీ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. జిల్లాలోని పుట్లూరు, యల్లనూరు తాడిపత్రి, బెళుగుప్ప మండలాల్లోని 16 రైతు సేవాకేంద్రాలకు 1000 క్వింటాళ్ల పప్పుశనగను సరఫరా చేశారు. ఆయా రైతు సేవాకేంద్రాల్లో ఇప్పటి దాకా 841 మంది రైతులు 971 క్వింటాళ్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఆయా రైతులకు స్టాక్ వచ్చిన వెంటనే విత్తనం పంపిణీ చేసినట్లు వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

బకాయిలు అప్పుడే చెల్లించి ఉండుంటే..

గతేడాది రబీ సీజన్‌లో పప్పుశనగ సరఫరాకు సంబంధించి రూ.40 కోట్లు బకాయిలు ఉండిపోయాయి. దీంతో ఈసారి రబీ సీజన్ ప్రారంభంలో సరఫరా మొదలు పెట్టలేదు. బకాయిలు చెల్లిస్తేనే.. సరఫరా మొదలు పెడతామని సబ్సిడీ ధరలు ఖరారు చేసిన సమయంలోనే కాంట్రాక్టర్లు మొండికేశారు. బకాయిలు చెల్లించడంగానీ, సరఫరాదారులను ఒప్పించి, పప్పుశనగ విత్తనం సరఫరా అయ్యేలా చూడటంపైగానీ అప్పట్లో ఎవరూ పట్టించుకోలేదు. వ్యవసాయ శాఖలోని ఓ రాష్ట్రస్థాయి అధికారి వైఖరి మూలంగానే ఈ సారి రైతులు సబ్సిడీ పప్పుశనగ విత్తనాలకు దూరమయ్యారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ చేయకుండా చేతులెత్తేసినట్లుగానే.. సరఫరాలో జాప్యం చేశారు. రబీ సీజన్ ప్రారంభమైన నెల రోజుల తర్వాత గతేడాదికి సంబంధించిన బకాయిలు చెల్లించడంతో ఆలస్యంగా పప్పుశనగ విత్తనాల పంపిణీ మొదలు పెట్టారు. ఈ పని రబీ సీజన్ ప్రారంభంలోనే చేసి ఉండుంటే.. జిల్లాలోని చిన్న, సన్నకారు రైతులకు సబ్సిడీ పప్పుశనగ అందేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పంటంతా సాగు చేసిన తర్వాత సబ్సిడీ విత్తనం పంపిణీ చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఈ తతంగం చూసి నల్లరేగడి రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

విడ్డూరంగా ఉంది



రబీ సీజన్‌లో పప్పుశనగ పంట సాగు చేసిన తర్వాత సబ్సిడీ విత్తనాలు పంపిణీ మొదలు పెట్టడం విడ్డూరంగా ఉంది. ఏటా రబీ సీజన్ ప్రారంభంలోనే సబ్సిడీ పప్పుశనగ పంపిణీ చేసేవారు. ఈసారి సబ్సిడీ ధరలు సకాలంలో ఖరారు చేసినా.. రైతులకు పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం వహించడం దారుణం. ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు పడటంతో గతనెల మొదటివారంలోనే విత్తనం మొదలు పెట్టారు. గత నెలలోనే విత్తనం వేయడం పూర్తయింది. తుఫాన్ ప్రభావంతో పొలాల్లో నీరు నిలవడంతో ఎండుతెగులు సోకి మొక్కలు చనిపోయాయి. ఆయా పొలాల్లో పంటను తొలగించి, తిరిగి విత్తనం వేసుకునే సమయంలో సబ్సిడీ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు ప్రకటించడం విడ్డూరం. బెళుగుప్ప మండలంలో తొలగించిన పంట పొలాల్లో తిరిగి విత్తనం వేసే రైతులకు కూడా సబ్సిడీ విత్తనం అందించలేకపోవడంతో బయట మార్కెట్‌లో కొనుగోలు చేసి విత్తుకున్నారు. ఈసారి నల్లరేగడి రైతులకు సబ్సిడీ విత్తనాలు ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేశారు.

- హనుమంతరాయుడు, ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి

సబ్సిడీ విత్తనం ఇవ్వలేకపోయారు



గతనెల మొదటి వారంలోనే ఐదెకరాల్లో పప్పుశనగ సాగు చేశా. సబ్సిడీ విత్తనాల కోసం ఎదురుచూసినా.. ఇవ్వకపోవడంతో బయట మార్కెట్‌లో కొనుగోలు చేసి పంట పెట్టా. ఇటీవల తుఫాన్‌తో వరుసగా వానలు పడటంతో పొలంలో వర్షం నీరు నిలబడి ఎండు తెగులు సోకి పంట దెబ్బతింది. ఎండిపోయిన పంటను తొలగించి, తిరిగి విత్తనం వేశా. ఇప్పుడైనా సబ్సిడీ విత్తనం ఇస్తారేమోనని చూశా. ఆలస్యం అవుతుందని బయట మార్కెట్‌లోనే కొనుగోలు చేసి, విత్తుకున్నా.

- రైతు ఓబయ్య, ఎర్రగుడి, బెళుగుప్ప మండలం



వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న నాయకులు, విద్యార్థినులు

స్వాతంత్ర్యోద్యమంలో తారకమంత్రం.. వందేమాతరం

● బీజేపీ నాయకులు ● ఘనంగా 150 వసంతాల వేడుకలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వందేమాతర గీతం స్వాతంత్ర్య పోరాటంలో తారకమంత్రమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం భారతజాతి గర్వించదగ్గ విషయమన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక సప్తగిరి సర్కిల్ జాతీయ జెండా వద్ద వందేమాతరం గీతాన్ని ఆలపించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ.. 1875లో బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గీతం భారత స్వాతంత్ర్య పోరాటానికి ప్రేరణగా నిలిచిందన్నారు. స్వాతంత్ర్యానికి మూల ధ్వనిగా, ఐక్యతకు చిహ్నంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, నేతలు కణంపల్లి చిరంజీవిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, అశోక్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు



క్రీడాజ్యోతిని ప్రదర్శిస్తున్న అధికారులు, అనంతపురం-అనకాపల్లి జట్ల మధ్య కబడ్డీ పోటీ



కూటమిలో బీసీలకు పెద్దపీట

కనకదాసు జయంతికి శాశ్వత జీవో

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



కళ్యాణదుర్గంలో భక్త కనకదాసు జయంతి, విగ్రహావిష్కరణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

6

విధుల్లోనూ క్రీడా స్ఫూర్తి చాటండి

- రెవెన్యూ క్రీడాపోటీలు అభినందనీయం
- సీసీఎల్‌ఏ స్పెషల్ సీఎస్ జయలక్ష్మి
- ఒత్తిడికి 'ఆట'విడుపు: కలెక్టర్ ఆనంద్
- క్రీడలతో, ఐక్యత, బాధ్యత మెరుగు
- ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు
- అనంతలో ఘనంగా ఏడో రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడోత్సవాలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిత్యం ఒత్తిడిలో ఉండే రెవెన్యూ ఉద్యోగులు కలిసికట్టుగా క్రీడాపోటీల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని సీసీఎల్‌ఏ స్పెషల్ సీఎస్ జయలక్ష్మి పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తిని విధుల్లోనూ ప్రదర్శించి సత్ఫలితాలు సాధించాలని ఆమె అభిలషించారు. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఏడో రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడా, సాంస్కృతికోత్సవాలు శుక్రవారం అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల కలెక్టర్లు ఆనంద్, శ్యాంప్రసాద్, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, జాయింట్ కలెక్టర్లు, ఇతర అధికారులతో కలిసి ఆమె క్రీడాజ్యోతిని వెలిగించి, పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీసీఎల్‌ఏ స్పెషల్ సీఎస్ జయలక్ష్మి మాట్లాడుతూ అనంతపురంలో ఏడో రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడా, సాంస్కృతికోత్సవాలు (మిగతా 7లో)



అనంతపురం ఉద్యోగుల మార్చ్‌ఫాస్ట్

ప్రజలకు చెప్పండి..!

16 నెలల్లో ఎన్నో మంచి పనులు చేశాం

- వైసీపీ ఫేక్ ప్రచారాలను తిప్పికొట్టండి
- పనిచేసినవారికి నామినేటెడ్ పదవులిచ్చాం
- కూటమి కార్యకర్తలు కలిసికట్టుగా వెళ్లాలి
- ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- కళ్యాణదుర్గంలో కార్యకర్తలతో సమావేశం
- యువనేతకు జనం, శ్రేణుల ఘన స్వాగతం



మంత్రి లోకేశ్ అభివాదం

కళ్యాణదుర్గం, అనంతపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేసిన మంచి పనుల గురించి ప్రజలకు తెలియజేయాలని టీడీపీ కార్యకర్తలు, నాయకులకు మంత్రి నారా లోకేశ్ సూచించారు. గడిచిన 16 నెలలలో ఎన్నో మంచి పనులను చేశామని ఆయన అన్నారు. కళ్యాణదుర్గంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ నియోజకవర్గ కార్యకర్తలు, నేతల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఉత్తమ కార్యకర్తలకు ఆయన అవార్డులను అందించి, సన్మానించారు. లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించి ఏపీని దేశంలో నంబర్ వన్ చేస్తామన్నారు. గతంలో ఎంతోమంది నిరుద్యోగులు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల వైపు ఉపాధి కోసం వెళ్లేవారని పేర్కొన్నారు. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఆయా రాష్ట్ర ప్రజలు కూడా ఏపీ వైపు చూసేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధిని చూసి ఎంతో మంది పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నారన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం టీడీపీకి కంచుకోట అని, ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని ప్రశంసించారు. తన సొంత నిధులు కూడా వెచ్చించి నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా నడుపుతున్నారన్నారు. కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి పునాది, బలం అన్నారు. వారి శ్రమను, కృషిని ఎన్నటికీ మరచిపోలేమన్నారు.

అనుభవంతో నడిపిస్తున్నారు..

చంద్రబాబు తనకున్న అనుభవంతో రాష్ట్రాన్ని సమర్థవంతంగా ముందుకు నడిపిస్తున్నారని లోకేశ్ అన్నారు. 'ఐదేళ్ల ఎన్నో ఇబ్బందులు పెట్టారు. నాపై అక్రమ కేసులు పెట్టారు. పాదయాత్రలో ఇబ్బందులకు గురిచేసినా కార్యకర్తలు అండగా నిలిచారు. అందరూ వస్తారు. ఆ రోజుల్లో బయటకు రావాలంటే భయం. ఎక్కడ ఇబ్బంది పెడతారో... కేసులు పెడతారోనని..! పక్కనే ఒక ఇల్లు ఉంది చూశారా.. లైటే లేదు. అదీ తెలుగుదేశం పార్టీ దెబ్బ' అని అన్నారు. 'టీడీపీ అంటే అనంతపురం... అనంతపురం అంటే టీడీపీ అని లోకేశ్ అన్నారు. 'మా కుటుంబాన్ని మీరు ఆశీర్వదించి దీవించారు. ఎన్టీఆర్, హరికృష్ణ, బాలకృష్ణను అక్కున చేర్చుకుని గెలిపించారు. మొన్నటి ఎన్నికల్లో సూపర్ మెజార్టీ ఇచ్చారు..' అని కృతజ్ఞతలు తెలిపారు.

సవాళ్లు అంటే ఇష్టం..

'నాకు సవాళ్లు అంటే ఇష్టం. అందుకే విద్యాశాఖను ఎంచుకున్నాను. మంగళగిరిలో మొదటిసారి పోటీ చేసినప్పుడు ఓడిపోయాను. అనేక రకాలుగా అవమానించారు. మొన్నటి ఎన్నికల్లో 91 వేల మెజార్టీతో గెలిచాను. అక్కడి నుంచి సౌండ్ లేదు. డీఎస్సీపైనా అనేక విధాలుగా మాట్లాడారు. 150 రోజుల్లో నిర్వహించి నియామకాలు చేపట్టాం. రాష్ట్రానికి అనేక పెట్టుబడులు తీసుకొస్తున్నాం. మన పిల్లల భవిష్యత్తు కోసం సీఎం ఎంతో కష్టపడుతున్నారు' అని లోకేశ్ అన్నారు. 'ఎన్నాళ్లు పక్కనున్న తమిళనాడు, కర్ణాటక, తెలంగాణను చూసి అసూయపడతాం..? ఏపీని చూసి పొరుగు రాష్ట్రాలు అసూయపడే రోజులు తీసుకువస్తాం' అని లోకేశ్ అన్నారు.

అబద్ధాలు చెప్పడంలో వైసీపీ దిట్ట...

'సీఎం చంద్రబాబును అనేక రకాలుగా అవమానించారు. మా తల్లిని అవమానించారు. ఎవరినీ వదిలిపెట్టేది లేదు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో 9 మంది భక్తులు చనిపోతే... ఆలయ నిర్వాహకుడు పాండా మాట్లాడిన మాటలపై ఫేక్ వీడియో తయారు చేసి వైసీపీ వాళ్లు దుష్ప్రచారం చేశారు. స్వామిని ప్రజల వద్దకు తీసుకెళ్లాలని 94 సంవత్సరాల పాండా రూ.20 కోట్లు పెట్టి గుడి కట్టారని అన్నారు. ఘటన జరిగిన వెంటనే తాను, కేంద్ర మంత్రి రామ్మోహన్, రాష్ట్ర మంత్రులు అచ్చెన్న, అనితమ్మ హుటాహుటిన అక్కడకు వెళ్లామని అన్నారు. వైసీపీ వాళ్లు అది కూడా పాండా వ్యాఖ్యలను ఎడిట్ చేసి పర్మీషన్‌కు అప్లయ్ చేస్తే ఇవ్వలేదని ఫేక్ చేశారని మండిపడ్డారు. వైసీపీ వారికి శవ రాజకీయాలు వెన్నతో పెట్టిన విద్యన్నారు.

చెల్లెమ్మ.. శ్రీచరణి..

మన తెలుగు బిడ్డ, క్రికెటర్ శ్రీచరణిని మూడు నెలల క్రితం విశాఖలో కలిసి బాగా ఆడాలని ప్రోత్సహించానని లోకేశ్ అన్నారు. వరల్డ్ కప్‌లో విజయం సాధించాక చెల్లెమ్మకి మంచి రివార్డు ఇవ్వాలని నిర్ణయించుకున్నామని అన్నారు. ఈలోగానే వైసీపీ వాళ్లు అక్కడ కూడా కులం ప్రస్తావన తెచ్చేందుకు ప్రయత్నించారని అన్నారు. ఈరోజు ఉండవల్లిలో శ్రీచరణి నన్ను కలిసినప్పుడు 24 గంటలు ఎలా కష్టపడుతున్నారని అడిగిందని అన్నారు. రాజకీయాల్లో మార్పు తేవాలంటే కష్టపడి పని చేయక తప్పదు.. గతంలో 32 మంది కమ్మ డీఎస్పీలకు ప్రమోషన్ ఇచ్చామని తప్పుడు ప్రచారం చేశారని, చివరకు నలుగురు మాత్రమే ఉన్నారని తేలిందని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా... అధికారంలో ఉన్నా... చంద్రబాబు రేయింబవళ్లు కష్టపడతారని అన్నారు. 75 ఏళ్ల వయస్సులోనూ ప్రధాని మోదీ ఎంతో కష్టపడుతున్నారని అన్నారు. అందుకే వారిలో వయోభారం కనబడదని అన్నారు.



అమ్మా నమస్కారం..

చాలా అవసరం...

టీడీపీ, జనసేన, బీజేపీ మూడు పార్టీలు కలిసికట్టుగా రాష్ట్రాన్ని, దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నాయని లోకేశ్ అన్నారు. పదిహేనేళ్ల పాటు మనం కలిసికట్టుగా కృషి చేసి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలుపుదామని పవనన్న చెబుతున్నారని, ప్రభుత్వం కొనసాగింపు చాలా అవసరమని అన్నారు. గుజరాత్, ఒడిశాలో ప్రభుత్వ కొనసాగింపు వల్ల అభివృద్ధి జరిగిందని అన్నారు. రాష్ట్రంలో మూడు పార్టీలు కలిసికట్టుగా ముందుకు వెళ్తాయని లోకేశ్ అన్నారు. కష్టపడినవారికే నామినేటెడ్ పదవులు ఇచ్చామని మంత్రి లోకేశ్ అన్నారు. కష్టపడేవారికి ఖచ్చితంగా తగిన ఫలితం ఉంటుందని ఆయన అన్నారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు

జగన్‌రెడ్డి.. కార్యకర్తలను పట్టించుకోలేదు...

జగన్‌రెడ్డి ఏనాడూ సొంత పార్టీ కార్యకర్తలను పట్టించుకోలేదని, కనీసం కార్యకర్తలకు చేయి అందించడని లోకేశ్ విమర్శించారు. కనీసం ఒక్క ఫొటో ఇవ్వరని అన్నారు. సొంత కార్యకర్త కారు కిందపడి చనిపోతే పక్కన పడేసి వెళ్లిపోయారని అన్నారు. దీనిని అందరూ గమనించాలని, కష్టపడి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని అన్నారు. సమావేశం అనంతరం టీడీపీ కార్యకర్తలను కలిసి అర్జీలు స్వీకరించారు. వారితో కలిసి ఫొటోలు దిగారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేందబాబు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జోనల్ కో-ఆర్డినేటర్, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



మహిళలు, చిన్నారుల కోలాహలం.



మంత్రి లోకేశ్‌కు హారతులు



అందరికీ అభివాదం..



మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు

కూటమిలో బీసీలకు పెద్దపీట

- కనకదాస జయంతికి శాశ్వత జీవో ● బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



కళ్యాణదుర్గంలో భక్త కనకదాస జయంతి, విగ్రహావిష్కరణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

అనంతపురం/కళ్యాణదుర్గం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేసిందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బీసీల పక్షపాతి అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న భక్త కనకదాస జయంతి వేడుకలు, విగ్రహావిష్కరణ ఏర్పాట్లను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తరువాతే బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం దక్కిందని అన్నారు. కురుబలకు అన్ని రంగాల్లోను అవకాశం కల్పించింది టీడీపీ ప్రభుత్వంలోనే అని, గతంలో తన తండ్రి ఎస్ రామచంద్రారెడ్డికి మంత్రిగా, ఎంపీగా, టీటీడీ బోర్డు సభ్యుడిగా అవకాశం కల్పించారని గుర్తు చేశారు. బీకే పార్థసారథికి ఎంపీగా, ఎమ్మెల్యేగా, జడ్పీ ఛైర్మన్‌గా అవకాశం కల్పించారని అన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే కురుబ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని, తనకు ఛైర్ పర్సన్‌గా అవకాశం కల్పించారని అన్నారు. గత ఎన్నికల్లో ఇద్దరు కురుబ నేతలకు ఎంపీలుగా, తనకు ఎమ్మెల్యేగా టిక్కెట్ ఇచ్చారని, గెలిచాక మంత్రిగా కూడా తనకు అవకాశం కల్పించింది టీడీపీనే అని అన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాస విగ్రహాన్ని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఏర్పాటు చేయించడం హర్షణీయమని అన్నారు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా కనకదాసు విగ్రహావిష్కరణ శుక్రవారం జరుగుతుందని తెలిపారు. త్వరలో అన్ని కార్పొరేషన్లకు నిధులు కేటాయిస్తామని, ప్రతి ఒక్కరినీ వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యమని అన్నారు. ఆదరణ-3 పథకం కింద కులవృత్తుల ప్రోత్సహిస్తామని తెలిపారు. కురుబ కులస్థులు చిరకాలంగా ఎదురుచూస్తున్న భక్త కనకదాసు జయంతిని అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించడానికి శాశ్వత జీవోను కూడా శుక్రవారం విడుదల చేశామని మంత్రి తెలిపారు. శాశ్వత జీవో తెస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన హామీ నెరవేరిందని అన్నారు. శాశ్వత జీవో ఇచ్చినందుకు మంత్రి నారా లోకేశ్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి కురుబ కులస్థుల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఎన్నికల హామీలో భాగంగా గుడికట్ల పూజారుల గౌరవ వేతనం, ధూప దీప నైవేద్యాలకు నెలకు రూ.7 వేలు అందజేయబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సత్యనారాయణ, ఆ శాఖ జిల్లా అధికారి కుష్బూ కొఠారి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవన శైలితో క్యాన్సర్ దూరం

- వైద్యవిద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్, సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం

అనంతపురం వైద్యం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రసాయన సమ్మిళిత ఆహారాన్ని భుజించకపోవడం, వ్యసనాలకు దూరంగా ఉండడం, శరీరానికి శ్రమను పెంచడం వంటి ఆరోగ్యకరమైన జీవన శైలితోనే క్యాన్సర్‌కు దూరంగా ఉండవచ్చని ప్రభుత్వ వైద్యవిద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం రేడియేషన్ ఆంకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ ప్రశాంతి అధ్వర్యంలో క్యాన్సపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ శంకర్, సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం ర్యాలీని ప్రారంభించి, మాట్లాడారు. క్యాన్సర్ పరీక్షలు చేసేందుకు ఓపీ 222 ఏర్పాటు చేశామన్నారు. ఓపీ 6లో పాప్‌స్మియర్ పరీక్షలుచేసి గర్భాశయ క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తున్నామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సరళ, సుచిత్ర, అసోసియేట్స్ నటేష్, మాధవీలత, సాయిరాణి, అసిస్టెంట్స్ సుష్మ, శ్రీనివాసరావు, నాగప్రవీణ్, గీతాంజలి, కుష్బూ, ఎన్ఎస్ఎస్ పీఓలు సుమన గోపీచంద్, లలిత, పరదేశినాయుడు, వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటింటా క్యాన్సర్ స్క్రీనింగ్...

ఇంటింటా క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం చేపడుతున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబీ దేవి పేర్కొన్నారు. డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి తెలుగు తల్లి విగ్రహం వరకు సాగిన ర్యాలీని ఆమె ప్రారంభించి, మాట్లాడారు. క్యాన్సర్ లక్షణాలు, నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జయలక్ష్మి, డీఎంఓ ఓబులు, డెమో నాగరాజు, హెచ్ఈఈఓ త్యాగరాజు, పీఎంఓ నాగన్న, డిప్యూటీ హెచ్ఈఈఓ గంగాధర్ పాల్గొన్నారు.

భూముల పరిశీలన



తలారిచెరువు వద్ద భూమిని పరిశీలిస్తున్న దృశ్యం

తాడిపత్రి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలారిచెరువు, భోగసముద్రం గ్రామాల పరిధిలో టిష్యూ కల్చర్ విధానంలో అరటి మొక్కల ఉత్పత్తి, పరిశోధన కేంద్రం ఏర్పాటుకు భూములను జిల్లా ఉద్యాన అధికారి ఉమాదేవి ఆధ్వర్యంలో బీటీఎస్ఎస్ఎల్ ఎండీ చేతన్‌జోష్, గ్లోబుల్ అగ్రి సిస్టం ప్రైవేటు లిమిటెడ్ డిప్యూటీ మేనేజర్ శ్రీవాత్సవ్ శుక్రవారం పరిశీలించారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్‌రెడ్డి, సర్వేయర్ రాంమోహన్, ఏడీహెచ్ దేవానంద్, హార్టికల్చర్ ఆఫీసర్ ఉమాదేవితో కలిసి మూడు చోట్ల భూములను పరిశీలించారు. రెండ్రోజుల్లో వాటిని సర్వేచేసి నివేదికలు పంపిస్తామని అధికారులు తెలిపారు.

గ్రామీణులకు మెరుగైన సేవలే లక్ష్యం

- ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నిరంజన్ రెడ్డి

అనంతపురం వైద్యం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నిరంజన్ రెడ్డి తెలిపారు. స్థానిక వైద్య కళాశాలలోని ఐఎంఏ హాల్‌లో శుక్రవారం ఐఎంఏ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. డాక్టర్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. సామాజిక దృక్పథంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడమే ఐఎంఏ లక్ష్యమన్నారు. ఇటీవ నిర్వహించిన కమిటీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా తనను, ప్రధాన కార్యదర్శిగా ఫణిమహేష్‌రెడ్డి, ట్రెజరర్‌గా అంజనీకుమార్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, చంద్రమోహన్, సుప్రజా చౌదరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు మనోరంజన్‌రెడ్డితోపాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు.



ఐఎంఏ నూతన కమిటీ సభ్యులు

తడిసెడు కష్టాలు..!

వర్షంలో తడిసి ముద్దయిన వేరుశనగ కాయలు, కట్టె

అంతంత మాత్రం దిగుబడితో రైతుల ఇబ్బందులు

గ్రాసం కూడా దక్కదని ఆవేదన



వానలో నానిన వేరుశనగ కట్టె

తాడిపత్రి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులు, తెగుళ్లతో వేరుశనగ రైతు తీవ్రంగా నష్టపోతున్నాడు. జిల్లాలో ఎక్కువగా మెట్ట భూముల్లో వర్షాధారంగా వేరుశనగ సాగు చేస్తున్నారు. ఇలా ఏడాదికి ఒక పంట దిగుబడితో వచ్చిన ఆదాయంతో సంవత్సరం పొడవునా కుటుంబాన్ని పోషించుకుంటాడు. దిగుబడి రాని ఏడాది అప్పులతో నెట్టుకురావాల్సిన పరిస్థితిని కొన్నేళ్లుగా జిల్లా రైతాంగం ఎదుర్కొంటోంది. వరుసగా కరువులు వస్తే మాత్రం చేసిన అప్పులు తీర్చలేక కొంతమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడటం పరిపాటిగా మారింది.

వేల ఎకరాల్లో సాగు

నియోజవర్గంలోని తాడిపత్రి మండలంలో 1100ఎకరాలు, పెద్దపప్పూరు 2119, యాడికి 2400, పెద్దవడుగూరు 1800ఎకరాల్లో ఈ ఏడాది వేరుశనగ సాగుచేశారు. కొంతమంది కౌలురైతులు కూడా వేరుశనగ సాగుచేశారు. విత్తనం సమయంలో తడిపొడి వర్షంతో పంట సాగుచేశారు. ఎకరాకు నాలుగైదు బస్తా(బస్తా 42కిలోలు)ల దిగుబడి వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. పెట్టుబడి దాదాపు రూ.25వేల నుంచి 30వేలు పెట్టినట్లు పేర్కొన్నారు. పంట దిగుబడి, ధర బాగా ఉన్నట్లయితే పెట్టుబడులు పోయి ఎకరాకు రూ.15 వేల నుంచి 20వేలు మిగులుతుండేది. కానీ ఈ సంవత్సరం పెట్టుబడి కూడా చేతికి అందే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. నాణ్యత ఉన్న వేరుశనగ కాయలను బస్తా రూ.2800 నుంచి 3200 వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. కానీ ఇటీవల తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు తడిసిన వేరుశనగ కాయలకు ఎంత రేటు వస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొందని పలువురు రైతులు పేర్కొన్నారు. వర్షం వల్ల పశువుల మేత కూడా నష్టపోయినట్లు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి వేరుశనగ కట్టె, కాయలు పూర్తిగా నాని ముద్ద అయ్యాయని రైతులు వాపోయారు. వర్షం ఉన్నట్లుండి రావడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు ఉండిపోయామని రైతులు ఆవేదన చెందారు.



నానిన వేరుశనగ కాయలు



వేరుశనగ వామి చుట్టూ వాన నీరు

వర్షంతో తీవ్రనష్టం : మహబూబ్‌బాషా, రైతు, చీమలవాగుపల్లి



నాకున్న ఐదు ఎకరాలతోపాటు 15ఎకరాలు కౌలుకు తీసుకొని మొత్తం 20ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేశా. ఇటీవల తుఫాన్ వల్ల వచ్చిన వానతో కొంతమేరకు వేరుశనగ కట్టె, కాయలు దెబ్బతిన్నాయి. కానీ బుధవారం కురిసిన వర్షానికి కొంత భాగం పంట నిట్టనిలువునా వర్షంలో తడిసి ముద్ద అయ్యింది. రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి, ఆదుకోవాలి.

తెరిపి ఇవ్వడంతో కాయలు ఆరబెట్టాం: రసూల్, రైతు



మాకున్న 5ఎకరాలు సాగుచేశాం. కొంతభాగంలో వేరుశనగ కాయలు విడిపించి ఆరబెట్టాం. గత వారం రోజులుగా తుఫాన్ వల్ల ఆకాశం ముసురు వేసి ఉండటంతో ఎండలేక కాయలు ఆరలేదు. అయితేఏ రెండు రోజులుగా తెరిపి ఇవ్వడంతో కాయలను ఆరబెట్టాం. కానీ హఠాత్తుగా వచ్చిన భారీ వర్షం వల్ల వేరుశనగ కాయలు మొత్తం తడిసిపోయాయి.

కొనేవారేరీ..?

అరకొరగా వేరుశనగ దిగుబడి

కొనేవారి కోసం రైతుల నిరీక్షణ

ధర లేక అన్నదాతల అగచాట్లు

శింగనమల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వేరుశనగ రైతులకు ఖరీఫ్ సీజన్ యథా ప్రకారం నష్టాలనే మిగిల్చింది. తీవ్ర వర్షాభావంతో అరకొరగా పండిన దిగుబడిని కూడా కొనే నాథుడు లేక రైతులు పొలాల్లోనే ఆరబోసుకుంటున్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 2 వేల ఎకరాలకుపైబడి వేరుశనగ సాగు చేశారు. కే6, లేపాక్షి 10, 12 రకాలు సాగు చేశారు. ఎకరానికి రూ.30వేలు పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. తొలుత వర్షాలు ఆశాజనకంగా ఉండటంతో పైరు ఏపుగా పెరిగింది. అయితే భూమిలో కాయలు ఏర్పడే దశలో వర్షాభావం వెంటాడింది. దీంతో విత్తనం పూర్తి స్థాయిలో ఏర్పడక కాయలు అవటను తగ్గాయని రైతులు వాపోతున్నారు. ఇటీవల మొంథా తుపాను నేపథ్యంలో కురిసిన వర్షాలకు కాయలు మొలకెత్తుతున్నాయని పంటను తొలగించారు. పంట నూర్పిడి తర్వాత 47 కిలోల బస్తాను వ్యాపారులు రూ.2400 ధరకు అడుగుతున్నారని, ఈ ధరతో ఏమాత్రం గిట్టుబాటు కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిట్టుబాటు ధర కోసం వేరుశనగ కాయలను కళ్లాల్లో రాశులు పోసి ఎదురు చూస్తున్నారు.



తక్కువ ధరకే వేరుశనగ కాయలు అమ్ముతున్న రైతులు

నష్టపోతున్నాం: కాయల వెంకటనారాయణ



గత పదేళ్ల నుంచి మాప్రాంతంలో వేరుశనగ పంట దిగుబడులు కనీసం పెట్టుబడులకైనా వచ్చేవి. ఈ ఏడాది నేను మూడు ఎకరాల సాగుకు రూ.90 వేలకుపైగా పెట్టుబడులు పెట్టా. పంట కాయల దశలో వాన రాకపోవడంతో దిగుబడులు తగ్గాయి. ఎకరానికి నాలుగు ఐదు బస్తాలే రావడంతో నాకు రూ.40 వేలు నష్టం వాటిల్లింది.

ఎవరు కోనుగోలు చేస్తారో?



మేము నాలుగు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాం. రూ.1.5లక్షల దాకా పెట్టుబడి పెట్టాం. విత్తనం బలిసే సమయంలో వాన లేక దిగుబడి తగ్గిపోయింది ఎకరానికి నాలుగైదు బస్తాలే దిగుబడి వచ్చింది. వాటిని కొనడానికి కూడా వ్యాపారులు ముందుకు రావడం లేదు.

- మహిళా రైతు నాగలక్ష్మమ్మ, పెద్దమట్లగొంది

ఎకరాకి నాలుగు బస్తాలే..



మేము ఆరు ఎకరాలు వేరుశనగ పంట సాగు చేశాం. పంట సాగు కోసం రూ.2.5లక్షలు ఖర్చు చేశాం. వర్షాలు రాకపోవడంతోపాటు మొంథా తుఫాన్‌తో దిగుబడులు ఎకరానికి నాలుగు బస్తాలు మాత్రమే వచ్చాయి. ధరలేని ప్రస్తుత పరిస్థుతుల్లో ఈ దిగుబడితో ఎలా బతికేది? ప్రభుత్వమైన పండిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి.

-ఆదిలక్ష్మి, మహిళా రైతు, పెద్దమట్లగొంది

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


విజయరాజు (ఫైల్)

గుత్తి రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):మండలంలోని బేతాపల్లికి చెం దిన విజయరాజు (25).. కర్నూలు జిల్లాలో రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మరణించాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బేతాపల్లికి చెందిన చిట్టి బాబు, రామంజినమ్మ దంపతుల కుమారుడు విజయరాజు. బైక్‌పై కర్నూలు జిల్లా డోన్‌కు బయల్దేరాడు. డోన్ మండలం కొత్తపల్లి శివారులో 44వ నంబరు జాతీయ రహదారిపై లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన విజయరాజును స్థానికులు డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ప్రమాదంపై డోన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్‌తీగ మీదపడి వృద్ధుడు..

యల్లనూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కాపురం గ్రా మంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌తీగ మీదపడడంతో శుక్రవారం సుబ్బరాయుడు (72) మృతిచెందాడు. హెడ్ కానిస్టేబుల్ శంకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుబ్బరాయుడు ఇంటిముందు ఉన్న చెట్టు కొమ్మలను కొట్టివేస్తుండగా విద్యుత్‌వైరుపై కొమ్మ విరిగిపడింది. విద్యుత్ సరఫరా ఉన్న వైరు సుబ్బరాయుడుపై పడడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మరణించాడు. సుబ్బరాయుడుకు భార్య రమణమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


వేణురంగనాయకులు (ఫైల్)

తాడిపత్రి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని యల్లనూరు రైల్వేగేట్ వద్ద శుక్రవారం వేణురంగనాయకులు (19) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వరప్రసాద్ తెలిపారు. యల్లనూరు మండలం చిలమకూరు గ్రామానికి చెందిన కృష్ణాంజనేయులు, రమణమ్మ దంపతుల పెద్ద కుమారుడు వేణురంగనాయకులు అర్జాస్‌స్టీల్ ప్లాంట్‌లో కార్మికుడిగా విధులు నిర్వర్తించేవాడు. రోజు చిలమకూరు నుంచి ప్లాంట్‌కు వచ్చి వెళుతుండేవాడు. గత కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. ఆస్పత్రుల్లో చూపించినా ప్రయోజనం లేకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

విధుల్లోనూ క్రీడా స్ఫూర్తి చాటండి

(5వ పేజీ తరువాయి)

నిర్వహించడం అభినందనీయమ న్నారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి 27జట్లుగా రావడం సంతోషకరమన్నారు. ఈ పోటీలు టీం వర్క్‌కి ప్రతీకగా నిలుస్తాయన్నారు. అనంతపురం జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలకు అనంతపురం వేదిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. సమష్టిగా క్రీడాపోటీల విజయవంతానికి కృషి చేయాలన్నారు. ప్రతి నిత్యం పని ఒత్తిడిలో ఉండే రెవెన్యూ ఉద్యోగులకు ఆటవిడుపుగా క్రీడా పోటీలు దోహదం చేస్తాయన్నారు. ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఆరు సార్లు రెవెన్యూ క్రీడాపోటీలు నిర్వహించామని, గతం కంటే ఘనంగా పోటీలు అనంతపురంలో నిర్వహించడం ఎంతో గొప్ప అనుభూతిని ఇస్తోందన్నారు. క్రీడలు సమయపాలన, ఐక్యత, బాధ్యతకు దోహదం చేస్తాయని తెలిపారు. అనంతరం నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్‌లో కాకినాడ జిల్లా మొదటి స్థానం, అనంతపురం ద్వితీయ స్థానం, తూర్పుగోదావరి తృతీయ స్థానంలో నిలిచాయి. అక్కడే ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్లు శివనారాయణ శర్మ, మౌర్య భరద్వాజ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్‌ఓలు మలోలా, సూర్యనారాయణ రెడ్డి, ఎఫ్ఎస్ఓ రామకృష్ణా రెడ్డి, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట రాజేష్, ఆర్డీఓలు కేశవనాయుడు, ఆనంద్‌కుమార్, శ్రీనివాస్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, మల్లికార్జునరెడ్డి, రామ్మోహన్, మల్లికార్జునుడు, రమేష్‌రెడ్డి తిప్పేనాయక్, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ త్రినాథరావు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, జీవన్‌చంద్ర, శ్రీరామమూర్తి, జిల్లా అధ్యక్షుడు దివాకర్‌బాబు, తెలంగాణ, ఏపీ ప్రతినిధులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.


మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న అనంతపురం రెవెన్యూ ఉద్యోగులు

ఉత్సాహంగా... ఉల్లాసంగా పోటీలు

ఏడో రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడా, సాంస్కృతికోత్సవాలు ఉత్సాహం... ఉల్లాసంగా సాగాయి. వాలీబాల్ పోటీల్లో మొదటి రౌండ్‌లో పశ్చిమగోదావరిపై ఎన్టీఆర్ కృష్ణా జిల్లా, పార్వతీపురంపై పల్నాడు, ఏలూరుపై అనకాపల్లి, తిరుపతిపై నంద్యాల, కడపపై అల్లూరి సీతారామరాజు, ప్రకాశంపై బాపట్ల, చిత్తూరుపై తూర్పుగోదావరి, శ్రీసత్యసాయిపై గుంటూరు, కర్నూలుపై అన్నమయ్య జట్లు విజయం సాధించాయి.

- కబడ్డీలో తిరుపతిపై పార్వతీపురం, నంద్యాలపై చిత్తూరు, పశ్చిమగోదావరిపై గుంటూరు, కర్నూలుపై శ్రీకాకుళం, కాకినాడపై తూర్పుగోదావరి, నెల్లూరుపై అనంతపురం జట్టు, అల్లూరి సీతారామరాజు జట్టుపై విశాఖపట్నం, ఎన్టీఆర్ జిల్లాపై బాపట్ల, కడప జిల్లాపై అన్నమయ్య జట్లు విజయం సాధించి రెండో రౌండ్‌కి అర్హత సాధించాయి.
- త్రోబాల్‌లో బాపట్లపై కడప, సీసీఎల్ఏ జట్టుపై పార్వతీపురం, గుంటూరుపై అనకాపల్లి, శ్రీసత్యసాయిజిల్లాపై నంద్యాల జట్టు విజయం సాధించాయి.
- బ్యాడ్మింటన్ మహిళల డబుల్స్‌లో పల్నాడుపై విజయనగరం, తూర్పుగోదావరిపై చిత్తూరు, నంద్యాలపై విశాఖపట్నం జట్లు గెలుపొందాయి.
- బ్యాడ్మింటన్ పురుషుల పోటీలో పశ్చిమగోదావరిపై అనకాపల్లి, ప్రకాశంపై నెల్లూరు, అల్లూరు సీతారామరాజు జట్టుపై కడప, ఎన్టీఆర్ జిల్లాపై కాకినాడ విజయం సాధించాయి.
- టెన్నికాయిట్ మహిళల పోటీల్లో శ్రీకాకుళంపై బాపట్ల, నంద్యాలపై కడప, ప్రకాశంపై గుంటూరు, నంద్యాల-45పై అనంతపురం-45, తిరుపతిపై చిత్తూరు, శ్రీకాకుళంపై నెల్లూరు జట్లు గెలుపొందాయి.
- క్యారమ్స్‌లో ఏలూరుపై నంద్యాల, అనంతపురంపై పార్వతీపురం, తూర్పుగోదావరిపై కర్నూలు, ఎన్టీఆర్ జిల్లాపై నెల్లూరు, కడపపై పల్నాడు జట్లు విజయం సాధించాయి.
- టేబుల్‌టెన్నిస్ మహిళల విభాగంలో విశాఖపట్నంపై కర్నూలు, పశ్చిమగోదావరిపై కడప, బాపట్లపై అనంతపురం, చిత్తూరు పై కాకినాడ జట్లు గెలుపొందాయి.
- చెస్ పురుషుల విభాగంలో తిరుపతిపై విజయనగరం, పల్నాడుపై నెల్లూరు జట్లు గెలుపొందాయి. మహిళల విభాగంలో తిరుపతిపై విజయనగరం, నెల్లూరుపై పల్నాడు, చిత్తూరుపై తూర్పుగోదావరి, కర్నూలుపై విశాఖపట్నం జట్లు గెలుపొందాయి.
- టేబుల్‌టెన్నిస్ పురుషుల విభాగంలో తూర్పుగోదావరిపై అనంతపురం ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ రామకృష్ణారెడ్డి గెలుపొందారు.


రెవెన్యూ క్రీడాజ్యోతితో మైదానంలో పరుగు


వాలీబాల్ ఆడుతున్న కలెక్టర్ ఆనంద్


కబడ్డీ పోటీల్లో ఆర్టీట మలోల

రద్దీకి తగ్గట్టుగా బస్సులు

- ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు


పుట్టపర్తి డిపోలో కార్మికులతో మాట్లాడుతున్న చైర్మన్ పూలనాగరాజు

పుట్టపర్తి టౌన్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా పుట్టపర్తికి వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలని జోనల్ చైర్మన్ పూల నాగరాజు అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం పుట్టపర్తి ఆర్టీసీ డిపో, బస్టాండ్‌ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. డిపోలో ఆర్టీసీ కార్మికులకు అందుతున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సత్యసాయి శత జయంతికి దేశవిదేశాల నుంచి బాబా భక్తులు, ప్రజలు లక్షలాదిగా పుట్టపర్తికి వచ్చే అవకాశం ఉందన్నారు. అందుకు తగ్గట్టు ఆర్టీసీ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బస్టాండ్, రైల్వే స్టేషన్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీటీఓ మధుసూదన్, డిపో మేనేజర్ ఇనయతుల్లా, సూపర్‌వైజర్లు హరిత, విజయానంద, షాషావలి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమోషన్లు ఇప్పించాలని వినతి


పట్టాభికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

పుట్టపర్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన వారందరికీ ప్రమోషన్ ఇచ్చేలా చొరవ చూపాలని సచివాలయ ఉద్యోగులు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభికి వినతి పత్రం అందజేశారు. పుట్టపర్తికి వచ్చిన ఆయన్ను సచివాలయ ఉద్యోగులు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణ కార్యదర్శులకు ఉన్న అనుబంధ శాఖలైన ఫుడ్ సేఫ్టీని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు లేదా మెడికల్ హెల్త్ శాఖలో కలిపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉన్నత విద్యను అభ్యసించిన సచివాలయ ఉద్యోగుల నైపుణ్యాలను సక్రమంగా వినియోగించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి సచివాలయ ఉద్యోగ నాయకులు భాస్కర్ రెడ్డి, మోహన్ కుమార్, నరసింహులు, రాజేష్, రాజశేఖర్ రెడ్డి, మారుతి, మదన్ ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇద్దరి జీవితాల్లో వెలుగులు


జయప్ప (ఫైల్)

ధర్మవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక శాంతినగర్ చెందిన జయప్ప(61) నేత్రాలను దానం చేయడం ద్వారా ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపారు. జయప్ప శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. విశ్వదీప సేవాసంఘం సభ్యులు.. ఆయన కుటుంబసభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. వారి అంగీకారం మేరకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జయప్ప నేత్రాలను సేకరించారు. జయప్ప కుటుంబికులను అభినందించారు.

విశాఖపై అనంత జట్టు విజయం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ క్రీడాపోటీల్లో భాగంగా క్రికెట్ మ్యాచ్‌లో విశాఖపట్నం జట్టుపై అనంతపురం 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన విశాఖపట్నం 18.4 ఓవర్లలో 100 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బరిలోకి దిగిన అనంతపురం జట్టు 16.5 ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. జేసీ శివనారాయణ శర్మ (22), ఓబులేసు (32), ఆకాష్ (29) రాణించారు. అనంత బౌలర్లు వినయ్ 4, వివేక్, అఖిల్ చెరో రెండు వికెట్లు తీశారు. విజేత జట్టును కలెక్టర్ ఆనంద్ అభినందించారు. సాయంత్రం నిర్వహించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


గెలుపొందిన జిల్లా క్రికెట్ జట్టును అభినందిస్తున్న కలెక్టర్ ఆనంద్

ఘనంగా హాకీ వందేళ్ల వేడుకలు


హాకీ విజేత ఆర్ట్స్ కళాశాల బాలుర జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): భారతదేశ జాతీయ క్రీడ హాకీ వందేళ్ల వేడుకలు ఘనంగా నిర్వహించారు. హాకీ అనంతపురం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. బాల, బాలికల విభాగాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సీనియర్ హాకీ క్రీడాకారులను సత్కరించారు. కార్యక్రమంలో హాకీ అనంతపురం ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, సహాయ కార్యదర్శి అక్రమ్ బాషా, క్రీడాకారులు పాల్గొన్నారు.

మీరు వెళ్లడానికి వీల్లేదు..!

- పుట్టపర్తిలో ప్రొటోకాల్ గొడవ

పుట్టపర్తి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఏపీ మాంసాభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రకాష్ నాయుడు, పోలీసుల మధ్య ప్రొటోకాల్ గొడవ జరిగింది. అనంతపురం జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం పుట్టపర్తి విమానాశ్రయానికి వస్తున్న మంత్రి నారా లోకేశ్‌కు స్వాగతం పలికేందుకు ప్రకాష్‌నాయుడు వచ్చారు. అయితే విమానాశ్రయంలో స్వాగతం పలికే వ్యక్తుల జాబితాలో పేరులేకపోవడంతో ప్రకాష్ నాయుడును పోలీసులు అనుమతించలేదు. దీంతో ప్రకాష్ నాయుడు, పోలీసుల మధ్య మాటామాటా పెరిగింది. అయితే అక్కడే ఉన్న పుట్టపర్తి డీఎస్పీ జోక్యం చేసుకుని విమానాశ్రయంలోకి ప్రకాష్ నాయుడును అనుమతించడంతో వివాదం సద్దుమణిగింది. ప్రొటోకాల్ జాబితాలో ప్రకాష్ నాయుడు పేరు చేర్చాల్సి ఉన్నా, చేర్చకపోవడం వల్లే వివాదం ఏర్పడినట్లు సమాచారం.

మైనింగ్ ప్రాంతంలో రాడార్ సర్వే


రాడార్ సర్వే చేపడుతున్న అధికారులు

డీ.హీరేహాళ్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సరిహద్దులోని వివాదాస్పద మైనింగ్ ప్రాంతాల్లో రాడార్ సర్వే జరుగుతోంది. గత పదిరోజులుగా రెవెన్యూ, అటవీశాఖ, మైనింగ్, ఇతర శాఖల అధికారులు సర్వే ఆఫ్ ఇండియా బృందంతో కలిసి ఈ సర్వే ప్రక్రియ నిర్వహిస్తున్నారు. వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి ఓఎంసీ, వైఎం మైనింగ్ ప్రాంతాలలో శుక్రవారం సర్వే చేపట్టారు. ఈ సర్వే ప్రక్రియలో భాగంగా మొదట జీపీఎస్ పాయింట్లు గుర్తించారు. అనంతరం డ్రోన్లతో సర్వే చేపట్టారు. రెండురోజులుగా రాడార్ సర్వే ప్రక్రియ కొనసాగిస్తున్నారు. సుమారు 250 ఎకరాలు సర్వే చేశారు. మూడు మైనింగ్ కంపెనీలలో సరిహద్దులను సర్వే చేశారు. ఈ సర్వేలో డీఎఫ్ఓ సోషల్ ఫారెస్ట్ ఆఫీసర్ గురుప్రభాకర్, మైన్స్ అండ్ జియాలజీ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, సర్వేయర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీ..ఫ్రీ..ఫ్రీ

కారు డ్రైవింగ్‌లో శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): రూడ్‌సెట్‌లో ఈనెల 20 నుంచి డిసెంబరు 19 వరకు మహిళలకు కారు డ్రైవింగ్‌పై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. 18-45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి రేషన్, ఆధార్‌కార్డు కలిగిన ఉమ్మడి జిల్లా నిరుద్యోగులు అర్హులన్నారు. 30రోజుల పాటు సాగే శిక్షణా కాలంలో భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. వివరాలకు ఎస్కేయూ సమీపంలోని రూడ్‌సెట్ కార్యాలయంలో నేరుగా లేదా సెల్ నంబరు 9492583484ను సంప్రదించాలని కోరారు.

ట్యాలీ కోర్సులో..

నిరుద్యోగ యువతకు కంప్యూటర్ ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఉన్నతి ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా చదివి 18-28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్ వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ ఉంటుందన్నారు. ఈనెల 10 నుంచి 60రోజుల పాటు ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఏఎఫ్ ఎకాలజీసెంటర్‌లో నిర్వహించే శిక్షణలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం ఆయా సంస్థలలో ఉద్యోగ అవకాశం కల్పిసామని తెలిపారు. వివరాలకు సెల్ నంబరు 9000487423ను సంప్రదించాలని కోరారు.

గ్యాస్ కనెక్షన్‌కు..

పుట్టపర్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద ఉచిత గ్యాస్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఎల్పీజీ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజీవ్ దేవ్ కోరారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అవసరమైన వారు జిల్లాలో ఆయా గ్యాస్ డీలర్ల వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. అయితే గ్యాస్ కనెక్షన్ ఉన్నవారికి ఇది వర్తించదన్నారు. దరఖాస్తుదారులు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, లబ్ధిదారుడి బ్యాంకు అకౌంటు పుస్తకం, కులధ్రువీకరణ పత్రం, రెండు కలర్ ఫొటోలు గ్యాస్ ఆఫీసులో ఇచ్చి, పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.16,100తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 23టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.20

అనంతపురం రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో శుక్రవారం టామోటాలు కిలో గరిష్ఠంగా రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.9తో, సరసరిగా రూ.14తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2100 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

రెజ్లింగ్‌లో జిల్లాకు పతకాల పంట


పతకాలు సాధించిన వారిని అభినందిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు, అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో జిల్లాకు పతకాల పంట పండింది. ఈనెల నాలుగు నుంచి ఆరో తేదీ వరకు విజయవాడలో జరిగిన ఎస్‌జీఎఫ్‌రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. బాలికల్లో లావణ్య, అనూషా, యశస్విని, లాస్యరెడ్డి, మందార, విష్ణు, ప్రియ, కావ్యశ్రీలు పతకాలు సాధించారు. బాలురలో రాఫీ, రోహిత్, రాజేష్, కార్తీక్, దిలీప్, భరత్, ప్రేమ్‌సాగర్, దుర్గాప్రసాద్, జస్వంత్, ప్రభాస్, రుషివర్ధన్‌లు విజేతలుగా నిలిచారు. విజేతలను శుక్రవారం డీఈఓ ప్రసాద్‌బాబు, ఏడీ మునీర్‌లు అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, కోచ్‌లు మల్లికార్జున, శర్మాస్, శ్రీనివాసులు, సాయి తదితరులు పాల్గొన్నారు.

గీతారెడ్డి అదుర్స్

- జాతీయస్థాయి పోస్టర్ పెయింటింగ్‌లో విజేతగా ఆవిర్భావం


రష్యా శాస్త్రవేత్త నుంచి అవార్డు అందుకుంటున్న గీతారెడ్డి

కణేకల్లు/అనంతపురం విద్య, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో 'అంతరిక్ష శాస్త్రం, ప్రపంచస్థాయి అధ్యయన అవకాశం' అనే అంశంపై నిర్వహిస్తున్న జాతీయస్థాయి పోటీల్లో మండలంలోని హనకనహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని గీతారెడ్డి సత్తాచాటింది. పోస్టర్ పెయింటింగ్‌లో జాతీయస్థాయిలో మొదటి బహుమతి కైవసం చేసుకుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం ఢిల్లీలోని ఇండో-రష్యా అంతరిక్ష పరిశోధన కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో గీతారెడ్డి విజేతగా నిలిచి రష్యన్ శాస్త్రవేత్త నుంచి అవార్డు అందుకుందన్నారు. డీఈఓ ప్రసాద్ బాబు, ఏపీసీ శైలజ, సైన్స్‌సెంటర్ అధికారి బాలమురళి విద్యార్థిని అభినందించారు.

ఏపీఐఐసీ డైరెక్టర్‌గా 'చల్లా'


డైరెక్టర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఇతర డైరెక్టర్లు, నాయకులు

అనంతపురం క్రైం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ రాష్ట్ర డైరెక్టర్‌గా చల్లా లక్ష్మీప్రసాద్ బాబును నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏపీఐఐసీకి సంబంధించి 15 మంది డైరెక్టర్లను నియమిస్తూ జీవో 189 విడుదల చేసింది. ఈ క్రమంలో అనంతపురానికి చెందిన చల్లా లక్ష్మీప్రసాద్ బాబుకు కూడా ఏపీఐఐసీ డైరెక్టర్‌గా అవకాశం దొరికిందింది. దీంతో పలువురు డైరెక్టర్లు పోతుల లక్ష్మీ నరసింహులు, పరమేష్, టీడీపీ నాయకులు కురుబ నారాయణస్వామి, తిరుపాల్, అరుణ్ మరికొందరు డైరెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

- ఎస్కేయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ జెస్సీ

గుంతకల్లుటౌన్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎస్కేయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ జెస్సీ పేర్కొన్నారు. స్థానిక శ్రీ శంకరానంద గిరిస్వామి డిగ్రీ కళాశాలలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అనుబంధ అంతర్ కళాశాలల పురుషుల గ్రూప్ సీ క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ.. విద్యార్థులు తమకు నచ్చిన క్రీడల్లో పాల్గొని సత్తా చాటాలన్నారు. ఖోఖో పోటీల్లో శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రన్నరప్‌గా నిలచింది. ఫుట్‌బాల్ పోటీలో పుట్టపర్తి మంగళకర కళాశాల విజేతగా నిలవగా, అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల రన్నరప్‌గా నిలిచింది. హ్యాండ్‌బాల్ పోటీల్లో రాయదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విజేతగా, అనంతపురం ఆర్ట్స్ కళాశాల రన్నరప్‌గా నిలిచాయి. రగ్బీలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం జట్టు విజేతగా, అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల రన్నర్‌ఎగా నిలిచాయి. సెపక్ తక్రా పోటీల్లో పుట్టపర్తి మంగళకర డిగ్రీ కళాశాల విజేతగా, గుంతకల్లు ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రన్నర్‌ఎగా నిలిచాయి. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మస్తానప్ప, పీడీలు మహబూబ్ బాషా, శ్రీరామ్, జయలక్ష్మి, రాజేష్, వీరేష్, సురేష్ పాల్గొన్నారు.


విజేతకు ట్రోఫీని అందజేస్తున్న డాక్టర్ జెస్సీ

జనసేన నాయకుడిపై దాడి

● తీవ్రగాయాలతో ఆస్పత్రిపాలు

శింగనమల, నవంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమట్లగొంది గ్రామంలో జనసేన నాయకుడు దండు హరీష్‌పై అన్నదమ్ములు, వైసీపీ నాయకులు సుధారక్ కుటుంబ సభ్యులు శుక్రవారం కొడవళ్లతో దాడి చేశారు. అన్నదమ్ములు దండు పెద్దసాలయ్య, దండు సుధాకర్ కుటుంబాల మధ్య పొలాలు, రస్తా విషయంలో గొడవలున్నాయి. తరచూ గొడవలు పడుతుండేవారు. శుక్రవారం ఉదయం ఇంటి వద్ద మహిళా కూలీ పనికి వచ్చే విషయంలో రెండు కుటుంబాల మధ్య గొడవ ప్రారంభమైంది. అది ఘర్షణకు దారితీసింది. పెద్ద సాలయ్య కుమారుడు, జనసేన నాయకుడు దండు హరీష్‌పై దండు సుధాకర్‌తోపాటు అతడి కుటుంబ సభ్యులు రాళ్లు, కట్టెలతో దాడి చేశారు. హరీష్ తలకు తీవ్ర గాయాలవడంతో కుటుంబ సభ్యులు శింగనమల ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఘర్షణపై ఏఎస్ఐ చితంబరయ్యను అడగ్గా.. రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగినట్లు తెలిసిందన్నారు. గాయపడిన దండు హరీష్, దండు సుధాకర్ ఆనతంపురం ఆస్పత్రిలో చికిత్స పొదుంతున్నారనీ, ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశామన్నారు. కాగా, ఆస్పత్రిలో దండు హరీష్‌ను శింగనమల మార్కెట్ యార్డు చెర్మన్ దండు శ్రీనివాసులు పరామర్శించారు.

శివాలయం నిర్మాణానికి రూ.లక్ష అందజేత



నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

గార్లదిన్నె, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురంలో చేపడుతున్న శివాలయం నిర్మాణానికి సంజీవపురం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు రమణప్ప లక్ష రూపాయలను అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆ నగదును శుక్రవారం అనంతపురం నగరంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ చేతుల మీదుగా కృష్ణాపురం గ్రామస్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దేవాలయాల నిర్మాణాలకు ప్రతి ఒక్కరూ వారివంతు సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఎంతైన ఉందని అన్నారు. మాజీ ఎంపీటీసీ రామాంజనేయులు, మాజీ ఉపసర్పంచు చల్లానాగరాజు, నాయకులు ఓబిరెడ్డి, రామాంజి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీపై అవగాహన



మాక్ అసెంబ్లీ నిర్వహిస్తున్న విద్యార్థులు

శింగనమల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మాక్ అంసెబ్లీపై నియోజకవర్గ విద్యార్థులకు మండలంలోని సోదనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఇందులో అసెంబ్లీలో జరిగే మాదిరిగా స్పీకర్ ఎన్నిక, సభ్యుల ప్రమాణ స్వీకారం, జీరో అవర్, ప్రశ్నోత్తరాలు, తీర్మాణాల ఆమోదం తదితరాలపై విద్యార్థుల చేత ప్రాక్టికల్‌గా చేయించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓలు నరసింహరాజు శివప్రసాద్, నారపరెడ్డి, లింగానాయక్, సిరాజుద్దిన్, శివశంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ బస్సుకు ప్రమాదం

● క్షేమంగా బయటపడ్డ విద్యార్థులు



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన స్కూల్ బస్సు

కనగానపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులతో వెళ్తున్న ఓ ప్రైవేటు పాఠశాల బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న బండరాయిని ఢీకొంది. అయితే అందరూ క్షేమంగా బయటపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు.. మండలంలోని చెన్నమనాయినికోట గ్రామంలో ఇమ్మాకులేట్ హార్ట్ ప్రైవేట్ స్కూల్ ఉంది. తరగతులు ముగిశాక శుక్రవారం సాయంత్రం విద్యార్థులతో బస్సు తగరకుంటకు బయల్దేరింది. మార్గమధ్యలోని గోశాలయ్యతోట వద్ద బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన బండరాయిని ఢీకొని ఆగిపోయింది. ఆ సమయంలో బస్సులో దాదాపు 55 మంది విద్యార్థుల వరకూ ఉన్నట్లు స్థానికులు తెలిపారు. బస్సు బ్రేకు ఫెయిల్ కావడంతో ప్రమాదం జరిగిందని వారు తెలిపారు. పాఠశాల బస్సులో సీట్లకు మించి విద్యార్థులను ఎక్కించుకుంటున్నారని, దీనిపై అధికారులు తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినితో హెచ్ఎం, పీడీ

చెన్నేకొత్తపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి విద్యార్థిని హర్షిణి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం ఓబుళమ్మ, పీడీ విజయనిర్మల శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అనంతపురం నగరంలోని బాలురజూనియర్ కళాశాలలో గత గురువారం జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీల్లో హర్షిణి ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి జట్టులో స్థానం సంపాదించిందని చెప్పారు. అనంతరం ఆ విద్యార్థిని పాఠశాలలో హెచ్ఎం, పీడీతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

నార్పల/ శింగనమల, నవంబరు7(ఆంధ్రజ్యోతి): జాతీయ క్యాన్సర్ అవగాహనా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, పలు పాఠశాలల విద్యార్థులు కలిసి ర్యాలీని నిర్వహించారు. ప్రధాన వీధిలో ర్యాలీ సాగింది. అనంతరం గాంధీ కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. వైద్యుడు హేమ భూషణ్ క్యాన్సర్ నివారణ పట్ల అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది ఏఎన్ఎంలు,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే మండలంలోని సిద్ధారాచర్లలో సర్పంచ్ సాకే రామాంజనేయులు, వైద్య సిబ్బంది కలిసి క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి కుళ్లాయప్ప, ఏఎన్ఎంలు, గ్రామస్థులు పాల్గొన్నారు. అదేవిధంగా శింగనమల మండలకేంద్రంలో తరిమెల మెడికల్ ఆఫీసర్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో వైద్యసచివాలయ సిబ్బంది,అంగన్వాడీ కార్యకర్తలు విద్యార్థులు కలిసి క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ సర్కిల్ వద్ద మనహారంగా ఏర్పడ్డారు. వైద్యురాలు తేజశ్విని, సీహెచ్ఓ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



నార్పలలో ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యేలు



పుట్టపర్తి ఎయిర్ పోర్టులో మంత్రి లోకేశ్‌కు పువ్వులు, పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలు ఇచ్చి స్వాగతం పలుకుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శనరావు

అనంతపురం క్రైం/రూరల్/శింగనమల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాపర్యటనకు శుక్రవారం వచ్చిన రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్‌ను ఎంపీ, ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు కలిశారు. పుట్టపర్తి ఎయిర్ పోర్టుకు చేరుకున్న మంత్రిని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కలిసి పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలు అందించి ఘన స్వాగతం పలికారు. జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శనరావు కూడా మంత్రిని కలిశారు.

వైసీపీ హయాంలో పింఛన్ల తొలగింపు

● టీడీపీ సానుభూతిపరులపై కక్ష సాధింపు
● ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మండిపాటు



వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్రైం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ సానుభూతి పరులకు పింఛన్లు తొలగించారని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో కక్షసాధింపు చర్యలు ఉండవంటూ భరోసా ఇచ్చారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఇందులో వివిధ సమస్యలు పరిష్కరించాలని పలువురు ప్రజలు సుమారు 58 వినతిపత్రాలు సమర్పించారు. వాటిని స్వీకరించిన ఎమ్మెల్యే అనంతరం మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంలో అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో టీడీపీకి అనుకూలంగా ఉన్న సుమారు రెండు వేల మందివి పింఛన్లను తొలగించారన్నారు. అలాగే అనేక పథకాలు అందకుండా చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అలాంటి కక్ష సాధింపులకు తావుండదన్నారు. పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాలు అందించాలని సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఆదేశించారన్నారు. ప్రతి శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కూడా నిర్వహించాలని సూచించారని చెప్పారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తమ దృ ష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. ఇప్పటికే అర్బన్ నియోజకవర్గంలో 453 మంది అర్జీదారుల సమస్యల్ని పరిష్కరించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ స్వప్న, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్, డైరెక్టర్లు వీఎల్ఎన్ మూర్తి, పరమేశ్వర్, పోతుల నరసింములు, కడియాల కొండన్న, చల్లా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థిక సాయం

గార్లదిన్నె, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత కల్లూరు గ్రామానికి చెందిన తపిల రామాంజనేయులు కుమార్తె అనూష వివాహానికి ఏడీసీసీబీ చైర్మన్ ముటిమడుగు కేశవరెడ్డి రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. ఆ నగదును స్థానిక టీడీపీ నాయకుల ద్వారా శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, అశోక్, శ్రీనాథ్‌చౌదరి, శేఖర్, బాబయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

నార్పల,నవంబరు7(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ నార్పల మేజర్ పంచాయతీ కార్మికులు శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం పట్ల అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా ఉన్నారని వాపోయారు. కనీస వేతనాలు ఇవ్వడం లేదని, తమతో వెట్టి చాకరి చేయించుకుంటున్నారని తెలిపారు. అందుకోసమే ఆందోళన పట్టాల్సి వచ్చిందని అన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్మికులు బాలాజీ, శివ, శ్రీనివాసులు, రమేష్ పాల్గొన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

అనంతపురంరూరల్, నవరంబరు7(ఆంధ్రజ్యోతి): రుద్రంపేట పంచాయతీ పంతుల కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బాలికలకు శుక్రవారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం వారు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ లహరి, ఐద్వా జిల్లా కార్యదర్శి చంద్రిక హాజరై వివరించారు. ఆపద పరిస్థితి వస్తే ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. ఐద్వా నగర కార్యదర్శి అశ్విని, కోశాధికారి గీత తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి



రైతులకు చెక్కులు అందజేస్తున్న క్రిష్ణమోహన్ చౌదరి

ఆత్మకూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతుల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నట్లు పి. యాలేరు సొసైటీ చైర్మన్ క్రిష్ణమోహన్ చౌదరి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో శుక్రవారం ఆయన పలువురు రైతులకు రుణాలకు సంబంధించిన చెక్కులు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులకు స్వల్పకాలిక రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలను అందజేస్తున్నట్లు తెలిపారు. సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. బ్యాంకు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఏఈ బాధ్యతల స్వీకరణ

శింగనమల, నవంబరు7(ఆంధ్రజ్యోతి): మండల విద్యుత్ శాఖ ఏఈగా సుదర్శన్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు సీకర్వరించారు. గత 8 నెలల నుంచి మండల విద్యుత్ శాఖ ఏఈ పోస్టు ఖాళీగా ఉంది. ఆ స్థానంలోని పుట్లూరు మండలంలో పనిచేస్తున్న సుదర్శన్‌రెడ్డిని బదిలీ చేశారు. దీంతో ఆయన వచ్చి బాధ్యతలు చేపట్టారు. రైతులు ప్రజలకు అందుబాటులో ఉండి విధులు నిర్వహిస్తానని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.

'స్వాత్రంత్య ఉద్యమానికి ప్రేరణ వందేమాతరం'



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న విద్యార్థులు



రామగిరిలో..

అనంతపురంరూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని నింపిన వందేమాతర గీతం 150 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. బంకిమ్ చంద్ర చటర్జీ రచించిన ఈ గీతం స్వాతంత్ర ఉద్యమానికి ప్రేరణగా నిలిచిందన్నారు. ప్రతిభారతీయుడిలో దేశభక్తి భావాన్ని నింపిందని పేర్కొన్నారు. విద్యార్థులు దేశంపట్ల ప్రేమను ఎల్లప్పుడూ అలవరచుకోవాలని సూచించారు. అలాగే ఇటుకపల్లి సమీపంలోగల అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు సమష్టిగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, నైపుణ్యాభివృద్ధి సంచాలకులు సురేంద్రనాయుడు, జాతీయ సేవాపథకం అధికారి మనోహర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

●రామగిరి: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలలో వందేమాతరం గీతాలాపన చేపట్టారు. ప్రతి విద్యార్థి వందేమాతర గీతం గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యత ఉందని ఉపాధ్యాయులు సూచించారు.

●కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు గ్రామవీధుల్లో ర్యాలీ చేపట్టారు. అనంతరం కూడలిలో మానవహారంగా ఏర్పడి వందేమాతర గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

లోకేశ్ వస్తున్నారని ఆనందం.. అంతలోనే ఆవిరి..!

● విద్యాశాఖ మంత్రి రాక కోసం రుద్రంపేట సర్కిల్లో మధ్యాహ్నం నుంచి ఎదురుచూపు
● ఘన స్వాగతానికి భారీ ఏర్పాట్లు
● హైవే మీదుగా కాన్వాయ్‌ని మళ్లించిన పోలీసులు
● నిరాశపడిన తెలుగు తమ్ముళ్లు, మహిళలు



లోకేశ్ కోసం ఎదురుచూస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు, ఇతర నాయకులు

అనంతపురం క్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): 'టపాసులు పేల్చండి.. పూల బుట్టలు సిద్ధం చేయండి.. గజమాల రెడీ చేయండి' అంటూ మధ్యాహ్నం ఉంచి ఒకటే హడావిడి. సుమారు 8 గంటల పాటు ఇదే ఉత్సాహం. తమ చిన్న బాస్, మంత్రి నారా లోకేశ్ జిల్లా కేంద్రానికి వస్తున్నారని.. తెలుగు తమ్ముళ్లలో ఆనందం, తెలుగు మహిళల మోముల్లో సంతోషం. అంతలోనే వారికి నిరాశ మిగిలింది. అదిగో పుట్టపర్తి ఎయిర్ పోర్టులో అన్న దిగారంట, అక్కడి నుంచి ఇప్పుడే బయలు దేరారంట, ధర్మవరానికి చేరుకున్నారంట, మరో 30 నిమిషాల్లో ఇక్కడికి వచ్చేస్తారు.. అంటూ ఆత్రుతగా ఎదురు చూశారు. ఇంతలోనే అన్న ముందుకెళ్లిపోయారు అనే వార్తతో తెలుగు తమ్ముళ్లు, మహిళల్లో ఆనందం ఆవిరైంది. మధ్యాహ్నం నుంచి ఎదరుచూసిన వారి ఆశలు అడియాశలు అయ్యాయి. ఇదీ శుక్రవారం మధ్యాహ్నం నుంచీ రాత్రి వరకూ కనిపించిన దృశ్యాలు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ జిల్లా పర్యటన నిమిత్తం వచ్చారు. ఈ క్రమంలో పుట్టపర్తి ఎయిర్‌పోర్టులో దిగి అక్కడి నుంచి రోడ్డు మార్గాన కళ్యాణదుర్గానికి బయలుదేరారు. ఆయనకు అనంతపురంలోని రుద్రంపేట సర్కిల్‌లో జాతీయ రహదారి బ్రిడ్జి కింద ఘనస్వాగతం పలికేందుకు భారీగా టీడీపీ శ్రేణులు, తెలుగు మహిళలు, ప్రజాప్రతినిధులు మధ్యాహ్నం నుంచి సిద్ధమయ్యారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో క్రేన్ సహాయంతో భారీ గజమాలను సిద్ధం చేశారు. పెద్దఎత్తున డ్రమ్స్‌తో సిద్ధంగా ఉన్నారు. టపాసులు కాలుస్తూ.. సంబరాలు చేసుకుంటూ కనిపించారు. అయితే రాత్రి మంత్రి కాన్వాయ్‌ను పోలీసులు రుద్రంపేట సర్కిల్‌లో ఆపకుండా జాతీయ రహదారిపై ముందుకు సాగించారు. దీంతో గంటల తరబడి అక్కడ ఎదురుచూసిన పార్టీశ్రేణులు, ప్రజల ఆశలు అడియాసలయ్యాయి. చిన్న బాస్‌ను చూసేందుకు, మాట్లాడేందుకు అవకాశం లేక పోయిందంటూ.. వారందరూ నిరాశతో వెనుదిరిగారు.

నారా లోకేశ్‌కు ఘన స్వాగతం



మామిళ్లపల్లిలో ప్రజలకు అభివాదం చేస్తున్న నారా లోకేశ్

కనగానపల్లి/ఆత్మకూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం సాయంత్రం పుట్టపర్తి ఎయిర్‌పోర్ట్ నుంచి కళ్యాణదుర్గంకు రోడ్డు మార్గాన వెళుతుండగా.. మండలంలోని మామిళ్లపల్లిలో టీడీపీ శ్రేణులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వాగతించారు. లోకేశ్ అందరికీ అభివాదం, కరచాలనం చేస్తూ ముందుకు సాగారు. స్వాగతించిన వారిలో డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, మార్కెట్‌యార్డు చైర్మన్ బోయపాటి సుధాకర్ చౌదరి, మండల కన్వీనర్ యాతం పోతలయ్య తదితరులు ఉన్నారు. అలాగే ఆత్మకూరు మండలంలోని వడ్డు పల్లి గ్రామంలోనూ లోకేశ్‌కు అక్కడి టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర విభిన్న ప్రతభావంతుల చైర్మన్ గడిపూటి నారాయణస్వామి, మండల కన్వీనర్ శ్రీనివాసులు జిల్లా నాయకుడు మల్లికార్జున రెడ్డి, పార్లమెంట్ అధికార ప్రతినిధి శశాంకచౌదరి తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

విద్యార్థుల భోజనంలో పురుగులు



భోజనంలో కనిపిస్తున్న తెల్లటి పురుగు

అనంతపురం రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు రోడ్డులో గల ఓ ప్రైవేట్ హాస్టల్లో విద్యార్థుల భోజనంలో పురుగులు దర్శనమిచ్చాయి. దీంతో విద్యార్థులు ఆందోళన చెందారు. ఈ విషయాన్ని హాస్టల్ నిర్వాహకులతో పాటు, విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేశారు. వివరాల్లోకి వెళ్లితే.. ఆలమూరు రోడ్డులోని ఓ ప్రైవేట్ హాస్టల్లో స్థానికంగా ఉన్న ఓ కళాశాలకు చెందిన పీజీ విద్యార్థులు 50 మంది వరకు ఉంటున్నారు. వారం రోజులుగా భోజనంలో నల్లటి పురుగులు కనిపిస్తున్నట్లు వారు నిర్వాహకులకు తెలిపారు. అయినా నిర్వాహకులు ఏమాత్రం పట్టించుకోలేదు. శుక్రవారం మధ్యాహ్నం కూడా భోజనంలో తెల్లటిపురుగులు రావడంతో విద్యార్థులు మరింత ఆందోళన చెందారు. బియ్యం శుభ్రం చేకుండానే వండుతున్నట్లు వాపోయారు. దీంతో భోజనంలో తరచూ పురుగులు కనిపిస్తున్నాయని చెప్పారు. ఈ విషయంపై ఆంధ్రజ్యోతి హాస్టల్ నిర్వాహకులతో మాట్లాడగా.. భోజనంలో పురుగులు రావడం వాస్తవమేనని చెప్పుకొచ్చారు. బియ్యం శుభ్రం చేసి, రెండు సార్లు కడిగి అన్నం వండుతున్నామని తెలిపారు. విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆ బియ్యం ప్యాకెట్లను వెనక్కు పంపించామని చెప్పారు.

కనకదాస విగ్రహావిష్కరణకు తరలిరండి



పోస్టర్ విడుదల చేస్తున్న కురుబ సంఘం నాయకులు

గార్లదిన్నె, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కురుబల ఆరాధ్యుడైన భక్త కనకదాస విగ్రహావిష్కరణ కార్యక్రమం కళ్యాణదుర్గంలో శనివారం ఘనంగా జరగనుందని, జిల్లావ్యాప్తంగా కురుబలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కురుబ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవులక్రిష్ణయ్య పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించి వాల్‌పోస్టర్లను మండలకేంద్రంలో శుక్రవారం ఆయన విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. భక్త కనకదాస 9 అడుగుల కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బ్యాళ్ల నాగేంద్ర, ఎంపీటీసీ సభ్యుడు రామచంద్ర, నాయకులు బ్యాళ్ళ ఈశ్వరయ్య, బాలాజీ, శేఖర్, బోలె రామాంజి, బుల్లె ఈశ్వరయ్య, బాబు, నారాయణస్వామి, మగ్గం రామాంజి, లింగయ్య, పెద్దయ్య, కుళ్లాయప్ప, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్కౌట్స్, గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవం

గార్లదిన్నె, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్కౌట్స్, గైడ్స్ 75వ వ్యవస్థాపక దినోత్సవాలను మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ తారా చంద్రానాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించడంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కోర్సులు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు స్కౌట్స్ అండ్ గైడ్స్ అందించే సేవలు ఎంతో విలువైవనవన్నారు. సౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరికలు పెరగాలని ఆకాంక్షించారు. అలాగే వందేమాతం గీతం రచించి 150 ఏళ్ల పూర్తయిన సందర్భంగా పాఠశాల విద్యార్థులతో ఆ గీతాలాపన చేయించారు. అదేవిధంగా ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోనూ వందేమాతర గీతం వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ యోగానందరెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ దామోదరమ్మ, పాఠశాల ప్రిన్సిపాల్ సాకే సతీష్, స్కౌట్ మాస్టర్ నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేసుల ఉపసంహరణ పట్ల కృతజ్ఞతలు

అనంతపురం వైద్యం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆర్టీటీకి ఎఫ్‌సీఆర్ఏను కొనసాగించాలని నెలలపాటు సాగిన ఉద్యమ పోరాటాల్లో భాగంగా నమోదైన కేసులను ఉపసంహరించిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికారి ప్రతినిధి అక్కులప్ప పేర్కొన్నారు. ఇటీవల కలెక్టరేట్ వద్ద వేలాది మందితో పొలికేక నిర్వహించి ఆర్డీటీ సేవల కొనసాగింపు ప్రాముఖ్యతను సమాజానికి వివరించామన్నారు. ఈ క్రమంలో తనపాటు ఉద్యమ నాయకులు సుగమంచి శ్రీనివాసులు, సాకేహరి, బీసీఆర్ దాస్, యల్లన్న తదితరులపై కేసులు నమోదయ్యాయన్నారు. ఇప్పుడు వాటిని ఎత్తివేసేలా చర్యలుతీసుకున్న ఎస్పీ జగదీష్, డిపార్ట్‌మెంట్‌కు కృతజ్ఞతలని పేర్కొన్నారు.

లైసెన్స్ రద్దుపై హైకోర్టుకు..

అనంతపురం అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న ఎస్ఆర్ ఫర్టిలైజర్స్ దుకాణం లైసెన్స్‌ను రద్దు చేయడంపై ఆ దుకాణం యజమాని మధుకర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. వ్యవసాయ అధికారులు ఇచ్చిన షోకాజ్ నోటీసుకు సంజాయిషీ ఇవ్వలేదన్న కారణంతో తన దుకాణం లైసెన్స్‌ను రద్దు చేశారని అతను హైకోర్టును ఆశ్రయించడంతో స్టే ఇచ్చినట్లు సమాచారం. తగిన ఆధారాలు జత చేసి, మరో సారి షోకాజ్ నోటీసు జారీ చేసి, డీలర్ వివరణ తీసుకోవాలని హైకోర్టు స్పష్టం చేసినట్లు సమాచారం. హైకోర్టు ఆదేశాల మేరకు మరోసారి షోకాజ్ నోటీసు జారీ చేస్తామని అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీ ఖాన్ పేర్కొన్నారు.



కళ్యాణదుర్గంలో మంత్రి నారా లోకేష్‌కు శుక్రవారం రాత్రి స్వాగతం పలుకుతున్న విప్ కాలవ శ్రీనివాసులు, ఆయన తనయుడు కాలవ భరత్

- రాయదుర్గం

కనీస గుర్తింపు లేదు

గుమ్మఘట్ట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తమకు అధికారులు కనీస గుర్తింపు ఇవ్వడం లేదని ఎంపీటీసీ సభ్యులు మండిపడ్డారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశాన్ని వారు బహిష్కరించబోయారు. ఎంపీడీఓ జయరాములు స్పందిస్తూ.. సభ్యులకు గౌరవించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. పలువురు వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీలు గ్రామాల్లో తమకు సమాచారం ఇవ్వకుండా గ్రామసభలు నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఉద్దేహాళ్‌లో గజగౌరీని ఊరేగిస్తున్న భక్తులు



విడపనకల్లులో అమ్మవారికి తీసుకెళ్తున్న మంగళహారతులు

ఘనంగా గజగౌరీ నిమజ్జనం

బొమ్మనహాళ్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంతకల్లు, ఉద్దేహాళ్, ఉప్పరహాళ్ తదితర గ్రామాల్లో గజగౌరీ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామునే గజగౌరీని జ్యోతులతో ఊరేగించి.. నిమజ్జనం చేశారు. కోలాటాలు, నృత్యాలతో అమ్మవారిని సాగనంపారు. ఉద్దేహాళ్ హైస్కూల్ మైదానంలో నిర్వహించిన రాతిదులం పోటీల్లో 15 జతల వృషభాలు పాల్గొన్నాయి.

● **విడపనకల్లు** : మండలకేంద్రంలో కడ్లే గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళలు, యువతులు అమ్మవారికి మంగళ హారతులు పట్టారు. శనివారం అమ్మవారిని నిమజ్జనం చేయడంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి.

పనులు త్వరగా పూర్తి చేయండి: ఎమ్మెల్యే

గుత్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక గుంతకల్లు రోడ్డులో జరుగుతున్న విస్తరణ పనులను తర్వగా పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మున్సిపల్, విద్యుత్, ఆర్అండ్‌బీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు పనులను ప్రజలకు ఇబ్బంది పూర్తి చేయాలన్నారు. అనంతరం రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎమ్మెల్యే తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మీయా, విద్యుత్ శాఖ ఈఈ పద్మానాభ పిళ్లై, ఆర్అండ్‌బీ జేఈ, స్థానిక టీడీపీ నాయకులు ఉన్నారు.

మాజీ సర్పంచ్ మృతి



గుత్తిరూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రజాపురం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ లక్ష్మినారాయణ (74) అనారోగ్యంతో శుక్రవారం మరణించారు. ఆయన ఒక సారిగా సర్పంచ్‌గా, రెండుసార్లు సింగల్ విండో అధ్యక్షుడిగా సేవలు అందించారు.

పెన్షనర్ల సంఘానికి విరాళం

తాడిపత్రి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): స్థానిక టీచర్స్ కాలనీలోని పెన్షనర్ల సంఘానికి విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ రూ.10 వేలు విరాళంగా అందజేశారు. అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి, సభ్యులు ఆయన్ను అభినందించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి : విప్

రాయదుర్గం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని విప్ కాలవ శ్రీనివాసులు కోరారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించిన ఆయన ప్రజలను నుంచి సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించారు. ఆర్థిక వ్యవహారాలతో సంబంధం లేని ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. భూముల రీసర్వే వల్ల వచ్చిన కొత్త సమస్యలు పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

ఉరుసు ఉత్సవాలు ప్రారంభం

బొమ్మనహాళ్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహొన్నూరులోని సయ్యద్ సర్మస్‌వలి ఉరుసు ఉత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. మొదటి రోజున గంధంను ఊరేగింపుగా తీసుకొచ్చారు. స్వామి వారి సమాధి వద్ద ప్రార్థనలు చేశారు.

బీడు భూములకు నీరివ్వండి : సీపీఐ

రాయదుర్గంరూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఉన్న 3.50 లక్షల ఎకరాల బీడుభూములకు నీరు ఇచ్చి.. వాటిని సాగులోకి తెచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గ సభ్యులు జగదీష్ కోరారు. స్థానిక ఎన్‌జీఓ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం హంద్రీనీవాలో నీరు పుష్కలంగా ఉన్నాయని, ఆ నీటిని బీడు భూములకు అందిస్తే ఈ ప్రాంత ప్రజల జీవితాలే మారిపోతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగార్జున పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో మాక్ డ్రిల్

గుంతకల్లు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రైలు ప్రమాదాలు జరిగిన సమయంలో చేపట్టాల్సిన సహాయక చర్యలపై రైల్వే శాఖ స్థానిక తిమ్మనచర్ల రైల్వే స్టేషన్‌లో శుక్రవారం మాక్ డ్రిల్‌ను నిర్వహించింది. ఉదయం తొమ్మిదిన్నరకు రైల్వే స్టేషన్‌లో ప్రమాద సైరన్ మోగగా యాక్సిడెంట్ రిలీఫ్ ట్రెయిన్ (ఏఆర్టీ), యాక్సిడెంట్ రిలీఫ్ మెడికల్ వ్యాన్ (ఏఆర్ఎంవీ)లను రైల్వే సిబ్బంది తిమ్మనచర్ల రైల్వే స్టేషన్‌కు తీసుకువచ్చారు. అక్కడ



రైలు ప్రమాదం జరిగినట్టు, ఒక దానిపై ఒకటి ఎక్కిన స్థితిలో బోగీలు ఉండగా రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. గ్యాస్ కట్టర్‌తో కిటికీ ఊచలను తొలగించి అగ్నిమాపక యంత్రాలతో మంటలను ఆర్పి అందులో ఉన్న ప్రయాణికుల పాత్రను పోషిస్తున్న సిబ్బందిని స్ట్రెచర్ల ద్వారా వైద్య శిబిరాలకు చేర్చారు. మొత్తం డ్రిల్ గంటన్నరలో పూర్తయిందని అధికారులు తెలిపారు.

గవిమఠం లీజు బకాయిలు రూ.2.2 కోట్లు

ఉరవకొండ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక గవిమఠానికి లీజుదారుల బకాయిలు పేరుకపోయాయి. ఉరవకొండ గవిమఠం స్థలంలో 314 దుకాణాలు ఉన్నాయి. వీటికి సంబంధించి లీజుదారులు రూ.2.22 కోట్లు దాకా బకాయిలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. 2019లో గవిమఠం స్థలాలను వేలం వేసేందుకు అధికారులు సిద్ధం కాగా లీజుదారులు కొంతమంది కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. ఐదేళ్ల నుంచి వారు లీజు చెల్లించకపోవడంతో వారి బకాయిలే సుమారు రూ.70 లక్షలు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. స్టేను వెకెట్ చేయించడంలోనూ గవిమఠం అధికారులు ఉదాశీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. కాగా బకాయిలున్న లీజుదారులకు సోమవారం నుంచి నోటీసులు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమైనట్లు సమాచారం. బకాయిదారుల్లో ప్రముఖ వైసీపీ నాయకుడు, దేవదాయశాఖలో పనిచేస్తున్న ఓ ఈఓ కుటుంబ సభ్యులు ఉండటం విశేషం.

కేబుల్ దొంగలను అరెస్ట్ చేయండి

యల్లనూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నపూసపల్లిలో పది రోజుల్లోనే సుమారు 30 మంది రైతులకు చెందిన పొలాల్లోని కేబుల్ చోరీ అయిందని, ఆ దొంగలను అరెస్ట్ చేసేలా చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ బోగాతి ప్రతాప్‌రెడ్డి, బాధిత రైతులు ఎస్ఐ రామాంజనేయ రెడ్డికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. ఒక్కో బోరు నుంచి సుమారు 50 మీటర్ల వరకు వైర్ చోరీ అయిందని, మీటర్ వైరు ధర సుమారు 300 ఉందని వాపోయారు. అంతేకాకుండా లోపల నుంచి వైర్ లాగడంతో తిరిగి మోటార్‌కు వైరు మార్చుకోవడానికి మోటార్‌ను బయటకు తీయాల్సిన వస్తోందని, దీనికి అదనంగా రూ. 5వేలు ఖర్చు అవుతోందని అన్నారు. ప్రతి రోజూ ఏదో ఒక తోటలో ఇలా చోరీలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

షాపింగ్ కాంప్లెక్స్ సీజ్

యాడికి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): యాడికిలో అహుడా అనుమతులు లేకుండా నిర్మించిన ఒక షాపింగ్ కాంప్లెక్స్‌ను డిప్యూటి ఎంపీడీఓ శశికళ శుక్రవారం సీజ్ చేశారు. ఆమె మాట్లాడుతూ.. యాడికికి చెందిన కొమ్మా గుణదీప్‌రెడ్డి ఇంటి నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ అధికారులతో అనుమతి తీసుకొని.. అందులో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారని, దీనిపై ఫిర్యాదులు వెళ్లడంతో జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ఆ షాపింగ్ కాంప్లెక్స్‌లోని గదులన్నింటిని సీజ్ చేశామని తెలిపారు. అహుడా అనుమతులు తీసుకున్న తర్వాత షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభానికి అనుమతి ఇస్తామన్నారు.